ఓం శ్రీ సాయిరాం

# శ్రీ పాదాలు

(సంగీత నృత్య నాటకం)

రచన : యం. ఎస్. ప్రకాశరావు

## ప్రార్థన

పల్లవి : సిద్ధి వినాయకం గణనాయకమ్
పర్తి విహారం భువనాధారం ॥సిద్ధి వినాయకం॥

చ.1 : సురవర సేవిత శ్రీపాద యుగళం
సుమధుర సుందర మృదుహాస తరళం
కరుణాపూరం గానమనోహరం
ప్రేమప్రదాయకం గణనాయకమ్ ॥సిద్ధివినాయకం॥

చ.2 : ఆనందామృత జలధి గంభీరం
అభయకరాంబుజ శుభదాయకం
త్రిజగన్నాయకం శాంతి ప్రదాయకం
చిరసుఖదాయకం గణనాయకమ్ ॥సిద్ధివినాయకం॥

(భాస్కర్ ఇల్లు. టెలివిజన్, పత్రికా విలేఖరులందరూ వేచి ఉంటారు. భాస్కర్ వివేక్‌తో ప్రవేశిస్తాడు.)

భాస్కర్ : ఫ్రెండ్స్. మిమ్మల్ని సంభ్రమాశ్చర్యాల్లో ముంచే అద్భుతమైన విషయం చెప్తానని మీకు వాగ్దానం చేశాను. I stand to my word. Meet my friend Dr. వివేకవర్ధన్. The great atomic scientist.

టి.వి. రిపోర్టర్ : డా. వివేకవర్ధన్‌గారా! What a great surprise.

పత్రికావిలేఖరి : వారు వివేకవర్ధన్‌గారే! గుర్తుపట్టాను.

మరొకవిలేఖరి : Incredible, ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్త వివేక్‌గారు మా కళ్ళముందున్నారంటే నమ్మశక్యంగా లేదు.

భాస్కర్ : కాని ఫ్రెండ్స్ ఇది యదార్థం. చంద్రుడి మీద మానవుడి పాదముద్రలు

వేయించిన మహనీయుడు, వేల మైళ్ళ దూరంలో ఉన్న లక్ష్యాన్ని ఛేదించగల ఖండాంతర క్షిపణిని కనిపెట్టిన విశ్వవిఖ్యాత శాస్త్రవేత్త. ఎంత పెద్ద దేశాన్నైనా రెండు నిముషాల్లో సమూలంగా భస్మీపటలం చేయగల న్యూట్రాన్ బాంబు సృష్టికర్త. నా బాల్య స్నేహితుడు డా. వివేకవర్ధన్. ఇప్పుడు డా॥వివేకవర్ధన్‌ని మీరు ఇంటర్వ్యూ చెయ్యవచ్చు.

వివేక్ : భాస్కర్. నీ అత్యుత్సాహం అదుపు చేసుకో. నా రాక గురించి ప్రచారం చెయ్యవద్దని ఎందుకు చెప్పానో ఒక్కక్షణం ఆలోచించు. అర్థం చేసుకో. సందేశాలివ్వడం కోసమో, భారతదేశ యువతను విదేశాలవైపు పరుగులు పెట్టించడానికో నేను రాలేదు.

భాస్కర్ : వివేక్! నేను చెప్పిందాంట్లో అసత్యమేముంది. నీలాంటి విశ్వవిఖ్యాత శాస్త్రవేత్తను కలుసుకోవడం, యావత్ర్పపంచాన్నీ ఆశ్చర్య చకితుల్ని చేసిన నీ విజయాల గురించి ముచ్చటించుకోవడంలో తప్పేముంది. ఈ విలేఖరులంతా నా ఆహ్వానం మన్నించి వచ్చారు. నీకిష్టం లేకపోతే...

వివేక్ : ఇష్టంలేక కాదు భాస్కర్. భారతేదేశానికి రావడంలో నా లక్ష్యం వేరు. నీ ఆహ్వానాన్ని మన్నించి వచ్చారు కనుక వారిని గౌరవించడం నా విధి. సరే ఫ్రెండ్స్ మీ ప్రశ్నలడగండి. కాని వాటికి క్లుప్తంగానే సమాధానాలిస్తాను.

టి.వి.రిపోర్టర్ : మీరు పంపిన ఉపగ్రహం అంతరిక్షంలో దూసుకుపోయి చంద్రుడిమీద సురక్షితంగా దిగి, మానవుడు తొలిసారిగా చంద్రుడిపై అడుగు పెట్టినప్పుడు మీకేమనిపించింది.

వివేక్ : మానవజాతిని నేనే ముందుండి నడిపిస్తున్నట్టనిపించింది.

పత్రికా విలేఖరి : Wonderful మీరు రూపొందించిన క్షిపణి ఖండాలు దాటి లక్ష్యాన్ని ఛేదించినప్పుడు ఎలాంటి అనుభూతి పొందారు?

వివేక్ : ప్రపంచాన్ని జయించడం నాకే సాధ్యమనిపించింది.

టి.వి.విలేఖరి : మీరు సృష్టించిన Neutron bomb విజయవంతంగా ప్రయోగించి ఎంత పెద్ద దేశాన్నైనా క్షణంలో భస్మీపటలం చేయగలదని తెలుసుకున్నప్పుడు అవధుల్లేని ఆనందం పొంది ఉంటారు. అవునా?

వివేక్ : ఎస్. నేనండగా ఉంటే ఏ దేశమైనా ప్రపంచాన్ని హస్తగతం చేసుకోగలదు అనుకున్నాను. ఆనాటి నా అనుభవాన్ని మాటల్లో వర్ణించలేను.

పత్రికా విలేఖరి : మీ భవిష్యత్ ప్రణాళిక ఏమిటి? ఎలక్ట్రాన్ బాంబు సృష్టించడమా?

వివేక్ : నెల రోజుల క్రితం వరకూ అదే. కాని ఇప్పుడది విరమించుకున్నాను.

భాస్కర్ : దేశదేశాలు నీ ఎలక్ట్రాన్ బాంబు కోసం ఆత్రుతతో ఎదురు చూస్తూంటే నువ్వు విరమించుకుంటానంటావేమిట్రా.

వివేక్ : భాస్కర్, ఫ్రెండ్స్ భవిష్యత్తులో ఏ మారణాయుధాల్నీ కనిపెట్టనని ప్రమాణం చేశాను. మానవజాతి సౌభాగ్యానికీ, అభ్యుదయానికీ అణుశక్తిని ఎలా వినియోగించుకోవాలో ప్రపంచానికి బోధిస్తాను. చంద్రుడి మీద రాళ్ళను పరిశోధించడం మాని మట్టిలో మాణిక్యాలు ఎలా వెలికి తీయవచ్చునో నా సాటి మానవాళికి తెలియజేస్తాను. లక్షల మానవుల వినాశనానికి ఉపయోగించే బాంబు కాక కోట్లాది ముఖాల్లో చిరునవ్వుల్ని పూయించగల పాశుపతాస్త్రం 'ప్రేమ'ని నా మనస్సులో చిగురింప చేయాలనుకుంటున్నాను.

భాస్కర్ : దీనికోసం ఈ పేద దేశానికి వచ్చావా?

వివేక్ : కర్ణకఠోరమైన ఆ మాటను ఉచ్ఛరించకు భాస్కర్! "భద్రం కర్ణేభిశ్శృణుయామదేవా: భద్రం పశ్యేమాక్షభిర్యజత్రా:" అంటే మంచినే విను మంచిని చూడు, మంచిగా మాట్లాడు దేవుడిచ్చిన ఈ శరీరంలోని ప్రతి అవయవము లోకకళ్యాణం కోసం ఉపయోగింపబడేలా చెయ్యి – నిరంతరం 'సమస్తలోకా: సుఖినోభవంతు అని ప్రార్థించు' అని మానవజాతికి శాంతి సహనాల్ని బోధించిన వేదశాస్త్రాలు పుట్టిన దేశంలో పుట్టి ఆ బోధనల్ని పెడచెవిని పెట్టి, ప్రేమతో ఈ దేశం నాకందించిన విద్యనీ, విజ్ఞానాన్నీ పేరు కోసం, ప్రతిష్ఠ కోసం మానవమారణ హెూమానికి వినియోగించి నేను క్షమించరాని నేరం చేశాను. ఆ నేరానికి ప్రాయాశ్చిత్తం చేసుకోవడానికే, నా పాపాలను ప్రక్షాళన చేసుకోడానికే, మంచినీ మానవత్వాన్నీ నాలో వికసింపచేసుకోడానికే భగవంతుని పాదస్పర్శతో పునీతమైన ఈ పుణ్యభూమికి వచ్చాను. I have returned from the land scientists to the land of saints నాలాంటి రాక్షసుల్ని సంహరించడానికి కాక సంస్కరించడానికి

భగవంతుడు అవతరించాడని విని వచ్చాను.

టి.వి : మీలో ఈ మార్పు చాలా ఆశ్చర్యంగా ఉంది.

ప.వి : నమ్మశక్యం కాకుండా ఉంది.

వివేక్ : కాని ఫ్రెండ్స్ ఇది వాస్తవం. నా భవిష్యత్ప్రణాళిక మీ అందరికీ త్వరలో తెలియజేస్తాను. శలవు.

(పత్రికా విలేఖరులు నిష్క్రమిస్తారు)

భాస్కర్ : వివేక్! నీకిష్టంలేని పని చేసి మీ మనస్సు నొప్పించాను. నన్ను క్షమించు.

వివేక్ : నీ ఉత్సాహం నాకు తెలుసు భాస్కర్. I love you ఇంకేమీ ఆలోచించకు.

భాస్కరన్ : కాని వివేక్ సైంటిఫిక్‌గా ఆలోచించే నీలో ఈ పరివర్తన నాకు ఆశ్చర్యంగా ఉంది. ఏ గురువు దగ్గరైనా ఉపదేశం పొందావా?

వివేక్ : లేదు. నా పరివర్తనకి కారణం పాతికేళ్ళ యువకుడు.

భాస్కర్ : యువకుడా! అసాధ్యుడై ఉంటాడు.

వివేక్ : అతిసామాన్యుడిలా ఉండే అసాధ్యుడు.

భాస్కర్ : అతిసామాన్యుడు నిన్ను మార్చగలిగాడా?

వివేక్ : నన్నే కాదు ప్రపంచాన్నే మార్చగల అసాధ్యుల ఆర్మీ ఉంది మనదేశంలో.

భాస్కర్ : Is it. ఎక్కడో చెప్పు. ఆ ఆర్మీలో నేనూ కలుస్తాను.

వివేక్ : ముందు నా అనుభవాన్ని చెప్పనీ.

❄❄❄

(విదేశాల్లో ఇంటిని తలపించే వాతావరణం వివేక్ పుస్తకం చదువుకుంటూ ఉంటాడు)

సారథి : నమస్కారం సార్

వివేక్ : గుడ్‌మార్నింగ్, మీరేనా సారథి అంటే. You sought my Interview

సారథి : అవునండి. నా సందేహాలకి సరియైన సమాధానం ఇవ్వగల విజ్ఞులని వచ్చాను.

వివేక్ : మీరేం చదువుకున్నారు?

సారథి : ఫిజిక్స్‌లో డాక్టరేట్ చేశాను.

వివేక్ : ఏ యూనివర్సిటీలో?

సారథి : శ్రీ సత్యసాయి విశ్వవిద్యాలయంలో.

వివేక్ : Is it a good universoty.

సారథి : దానికి తులతూగే విశ్వవిద్యాలయం ప్రపంచంలో లేదు.

వివేక్ : What do you mean. నేను చదువుకున్నదీ, పదవులు చేపట్టినదీ ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయం. A great university in the world.

సారథి : అని మీరనుకోవడం కాదు. ప్రపంచం గుర్తించాలి.

వివేక్ : ప్రపంచం ఎప్పుడో గుర్తించింది.

సారథి : గుర్తింపు గణాంకాల్ని, అంటే స్టేటస్టిక్స్‌ని బట్టి కాదు. గొప్పతనం ఆ యూనివర్సిటీ విద్యార్థుల నైతిక ప్రవర్తనలో ప్రతిబింబించాలి. ఆచార్యుల ఆధ్యాత్మిక చింతనలో కనపడాలి. నిర్వాహకుల ప్రేమలో తొణికిసలాడాలి.

వివేక్ : మా విశ్వవిద్యాలయం నాలాంటి మేధావులను ఎందరినో తీర్చిదిద్దింది. వారందరూ మా యూనివర్సిటీకి పేరు తెచ్చారు.

సారథి : ఆ పేరు ప్రతిష్ఠలు ఎలా వచ్చాయో చెబుతారా.

వివేక్ : నన్నే తీసుకో. ఉపగ్రహాన్ని సృష్టించాను. మా యూనివర్సిటీ పొంగిపోయింది. మానవుడు చంద్రుడి మీద అడుగు పెట్టేలా చేశాను. మా యూనివర్సిటీకి ఉత్తమ యూనివర్సిటీగా పురస్కారం లభించింది. ఖండాంతర క్షిపణిని ప్రయోగించాను. నన్నూ, నా యూనివర్సిటీని ప్రపంచం వేనోళ్ళ పొగిడింది. న్యూట్రాన్ బాంబు కనిపెట్టాను. నన్ను గోల్డెన్ మేన్ వరించింది.

సారథి : (నవ్వుతాడు)

వివేక్ : నవ్వుతావెందుకు?

సారథి : మీ అమాయకత్వానికి ఇంకేం చెయ్యమన్నారు.

వివేక్ : What do you mean.

సారథి : మీకర్థమయ్యేలా స్పష్టంగా చెప్పమంటారా? మీ చుట్టూ ఉన్న ప్రకృతిని చూడండి, వినీలమైన ఆకాశం, ఉరకలెత్తే సాగర తరంగాలూ, వెన్నెల కురిసే చందమామా, కిలకిలా ముద్దబంతుల్లా నవ్వే పిల్లలూ, పరిమళభరితమైన సప్తవర్ణాలతో మెరిసే పువ్వులూ, ఎంత అందంగా ఉంది ఈ భగవత్సృష్టి. మానవుడికి ఆనందం, ఆహ్లాదం కలిగించే ఇందులో ఏ ఒక్కదాన్నైనా మీరు సృష్టించగలరా!

వివేక్ : No it is not possible. సాధ్యంకాదు.

సారథి : మరి వీటిని నాశనం చేసే అధికారం మీకెవరిచ్చారు. మానవజాతి మనుగడకే విఘాతం కలిగించే వినాశనానికి పూనుకునే అర్హత మీకెలా కలిగింది. సాటి మానవుడిగా అడిగే అధికారం నాకుంది. సమాధానం చెప్పండి.

వివేక్ : సారథీ. No body has questioned me like this.

సారథి : ఇప్పుడు నేనడుగుతున్నాను. నాకు సమాధానం చెప్పండి.

వివేక్ : అర్హత లేదు నిజమే. ఈ విషయం నేనెప్పుడూ ఆలోచించలేదు.

సారథి : ఇప్పుడాలోచించండి. మీరు సృష్టించిన బాంబులు, హాయిగా ఆనందంగా జీవిస్తున్న ఎంతమంది ప్రాణాలు తీశాయి. ఎంతమంది పసిపాపల్ని హతమార్చాయి. సుందరమైన ఈ ప్రకృతిని ఎన్ని దేశాల్లో నాశనం చేశాయి. ఎన్నిదేశాలు స్మశానవాటికలయ్యాయి. వాళ్ళకి మళ్ళీ మీరు ప్రాణం పొయ్యగలరా. ఆ దేశాల్ని మళ్ళీ నందనవనంలా తీర్చిదిద్దగలరా.

వివేక్ : నేను ఇంత విధ్వంసానికీ, ఇంత వినాశనానికీ కారణమయ్యేనా?

సారథి : ఏం మీకు తెలియదా? సత్కారాల హోరులో, పురస్కారాల ప్రభంజనంలో, ఆ అమాయకుల ఆర్తనాదాలు వినిపించి ఉండవు. వారి కన్నీళ్ళ వెచ్చదనం మీకు సోకి ఉండదు. సర్వస్వం కోల్పోయి వారి గుండెలు పగిలిపోతే నవ్వుతూ మీరు పార్టీలు చేసుకుని ఉంటారు.

వివేక్ : ఆపు. సారథీ. ఆపు నేను రాక్షసుణ్ణి కాదు.

సారథి : కాని ఇంతవరకూ మీరు ప్రదర్శించినది రాక్షసత్వమే. కాదంటారా? దేశాలమధ్య విభేదాలుంటే పదవులనలంకరించిన పెద్దలు ఒకచోట కూర్చోవాలి. మాట్లాడుకోవాలి. సమస్యలు పరిష్కరించుకోవాలి. అంతేగాని ఏ పాపం ఎరుగని అమాయకుల ప్రాణాల్ని బలి తీసుకుంటారా? అని ఎవరికైనా చెప్పారా? మీరు చెప్పరు. పేరు ప్రతిష్ఠల కన్న మనిషి ప్రాణాలు గొప్పవి కావు మీకు. మీరు సృష్టించిన బాంబు కన్న భగవంతుడి అద్భుత సృష్టి గొప్పది కాదు.

వివేక్ : సారథీ ఆపు. నీ మాటలతో నన్ను చిత్రవధ చెయ్యకు. నేను భరించలేను.

సారథి : మాటల్నే మీరు సహించలేకపోయారే మరి మీ తూటాల్ని ఆ అమాయకులు ఎలా

భరించారో ఆలోచించారా.

వివేక్ : సారథీ I am extremely sorry for what I have done. చిన్నవాడివైనా నీకు చెయ్యెత్తి నమస్కరిస్తున్నాను. ధైర్యంగా నా తప్పు చెప్పినందుకు నన్ను మన్నించు.

సారథి : మన్నించడానికి నేనెవర్ని. ఛిన్నాభిన్నమైన ఆ దేశవాసులు మిమ్మల్ని మన్నించాలి. వాళ్ళ కన్నీళ్ళు మిమ్మల్ని క్షమించాలి.

వివేక్ : సారథీ. నేను చేసిన పనికి సిగ్గు పడుతున్నాను. I treat you as my son చెప్పు. నా పాపాల్నెలా ప్రక్షాళన చేసుకోవాలి.

సారథి : ఈ ప్రపంచం పట్ల ప్రేమ పెంచుకోండి. సాటివారిని ఆదరించండి, ప్రేమ పంచండి. ఈ జగత్తులో ద్వేషాన్ని అంతం చేసి చిరునవ్వుల వెన్నెలలు కురిపించడానికి కృషి చెయ్యండి.

వివేక్ : ఇన్నాళ్ళూ దానవుడిలా ప్రవర్తించిన నాకది సాధ్యమేనా?

సారథి : భగవంతుడి పాదాలు ఆశ్రయించండి. సాధ్యపడుతుంది.

వివేక్ : ఎలా ఆశ్రయించాలి. దేవుడు కనపడడే.

సారథి : అచంచల విశ్వాసంతో నిరంతర చింతన చెయ్యండి, ఆయన తప్పక కనిపిస్తాడు.

వివేక్ : ఎక్కడ?

సారథి : ప్రశాంతి నిలయంలో. భగవాన్ శ్రీ సత్యసాయిబాబా రూపంలో.

వివేక్ : పద. ఈరోజే ఫ్లైట్‌కు ఇండియా వెళదాం.

సారథి : అక్కడ అడుగు పెట్టడానికి అర్హత సంపాదించుకోవాలి.

వివేక్ : అదెలా?

సారథి : భగవద్విశ్వాసాన్ని పెంచుకోవాలి.

వివేక్ : ఎలా?

సారథి : పుణ్యక్షేత్రాలు దర్శించండి. ఆ కథలు వినండి. అప్పుడు అవతార పురుషుని దర్శించండి. రండి నాతో. మీ మనస్సు బాధపెట్టాను. సారీ సర్.

వివేక్ : No my son. నాకు కనువిప్పు కలిగించావు.

❄❄❄

(రాజయ్య, మల్లన్న, శివయ్య ముగ్గురూ విడిచి వెళుతూ ఉంటారు)

రంగయ్య : ఒరే శివా మీరిక్కడ ఉన్నారా! మీకోసం ఊరంతా వెదికాను.

శివయ్య : మాకోసం వెతికావా ఎందుకు బాబాయ్?

రంగయ్య : శివా! నీతో ఎప్పుడైనా హాస్యం ఆడేనా. పూడిక తీస్తే కాని బావిలో నీరు రాదు. నీరొస్తే కాని బావిలో నీరు రాదు. నీరొస్తే కాని నారు పొయ్యలేను. అందరూ నారు పోతలో ఉన్నారు. ఇంతదూరం ఈ అడవిలోకి ఎవరు వస్తారు. కాస్త సాయం చెయ్యండిరా మీ కాళ్లు పట్టుకుంటాను.

శివయ్య : కాదు బాబాయ్. రాజు మూగవాడు నోరు లేదు. నేనా అవిటివాణ్ణి బాగా నడవలేను. తమ్ముడు మల్లన్నకి బ్రహ్మచెవుడు, మేం ఏం సాయం చెయ్యగలం చెప్పు.

రంగ : ఎలాగో చెయ్యండిరా మీ కష్టం ఉంచుకోను.

శివయ్య : బాబాయ్ ప్రాధేయపడుతున్నాడు పోనీ బావిలో పూడిక తీద్దామా (రాజయ్య, మల్లన్న సంజ్ఞలతో అంగీకారం తెలుపుతారు) సరే పద బాబాయ్ పలుగూ పారా అందుకో. (బావిలోకి దిగి పలుగుతో త్రవ్వుతున్న చప్పుడు)

శివయ్య : బాబాయ్. రాయికి పలుగు తగిలి రక్తం వస్తోంది.

రంగయ్య : రాయికి తగిల్తే రక్తం రావడమేమిట్రా. చుట్టూ మట్టి తియ్యి.

శివయ్య : బాబాయ్. రాయి కాదు గణపయ్య.

రంగయ్య : గణపయ్యేమిట్రా.

శివయ్య : అద్భుతం. మహాద్భుతం. సిద్ధి వినాయకుడు వెలిశాడు చూడు బాబాయ్. ఆ గోడ పగలగొట్టు బాబాయ్. (పగలగొట్టిన చప్పుడు. +++)

మల్లన్న : విఘ్న వినాయకా సిద్ధి వినాయకా రక్షమాం రక్షమాం.

శివయ్య : బాబాయ్ ఎంత అదృష్టవంతుడివయ్యా. గణపయ్య నీ బావిలో వెలిశాడు.

రంగయ్య : శివా! నాది అదృష్టం కాదురా నీదిరా అదృష్టం. అటు చూడు.

మల్లన్న : 'జై గణనాధా' జై గణనాధా
జయ జయ జయ జయ
జయ గణనాధా!

శివయ్య : బాబాయ్ మా మల్లన్నకి మాటొచ్చింది.

రాజయ్య : అన్నా. నీ మాటలు నాకు చక్కగా వినిపిస్తున్నాయిరా!

శివయ్య : ఆ గణపయ్య దయరా. ఒరే రాజూ నన్ను చూడరా! నడవగలుగుతున్నాను! జై గణనాథా!

బాబాయ్ : తల్లీ తండ్రీ లేని మీకు ఆ వినాయకుడే తల్లీ తండ్రీ అయి రక్షించాడురా. సిద్ధివినాయకా నీకు సేవ చేసిన ఈ అమాయకులకు సాక్షాత్కరించి కరుణతో కాపాడావా. అంగవైకల్యం లేకుండా అనుగ్రహించావా స్వామీ! జై వినాయకా జైజై వినాయకా జై వినాయకా జైజై వినాయకా జై వినాయకా జైజై వినాయకా (నినాదాలు హోరెత్తుతాయి)

❄❄❄

సారథి : విన్నారు కదా సర్. భగవంతుడు మూగవాడికి మాటని, కుంటివాడికి నడకనీ, బధిరుడికి వినికిడినీ అనుగ్రహించిన పుణ్యస్థలం ఈ కాణిపాకం.

వివేక్ : ఈ పుణ్యక్షేత్రాల్లో ఇంతటి భక్తి ప్రపత్తులూ, ప్రశాంతతా ఉంటాయని తెలియదు సారథీ. లక్షలాది ప్రజలు ఈ సిద్ధి వినాయకుణ్ణి దర్శించి తరిస్తారుట.

సారథి : ఇప్పుడు తెలిసింది కదా! మన సంప్రదాయం పిల్లల్లో కూడా భక్తి భావనలు వికసింపచేస్తుంది చూడండి.

**పాట**

పల్లవి : వినాయకా నీ మూర్తికే నా మొదటి ప్రణామం
నీవు కొలువున్న మా మనసే నిరతమూ ఆనందధామం ॥వినాయకా॥

చ. 1. : లక్ష్మీరమణుడు శ్రీహరి కూడా తలచును నీ శుభనామం
వాణీ బ్రహ్మలు కూరిమి తోడ చేతురు నీ గుణగానం
పార్వతిదేవీ హృదయవిహారి
శివసుత గణనాథా ॥వినాయకా॥

చ. 2. : విఘ్న వినాయక వేద స్వరూపా షణ్ముఖ సోదరస్వామీ
దత్తాత్రేయా అయ్యప్పరూపా ప్రమథాదీశ నమామి
తల్లివి నీవే – తండ్రివి నీవే.........
సకలము నీవయ్యా...... ॥వినాయకా॥

(శ్రీ కాళహస్తీశ్వరాలయ ప్రాంగణం)

❄❄❄

శివబ్రాహ్మణుడు: నమస్తేస్తు భగవాన్ విశ్వేశ్వరాయ మహాదేవాయ త్ర్యయంబకాయ త్రిపురాంతకాయ త్రికాగ్ని కాలాయ కాలాగ్ని రుద్రాయ నీలకంఠాయ మృత్యుంజయాయ సర్వేశ్వరాయ సదాశివాయ శ్రీమన్మహాదేవాయనమ:

మళ్ళీ మాంస నైవేద్యమా! పరమశివా! ఈ అనాచారాన్ని ఎలా సహించమన్నావు స్వామీ! మహాదేవుడికి మాంస నైవేద్యం పనికిరాదురా, పెట్టకూడదురా, పరమపాతకంరా అని చిలక్కి చెప్పినట్టు చెప్పాను. నా మాట వినరా అని ప్రాధేయపడ్డాను. ఏం ప్రయోజనం లేదు. స్వామీ ఇక లాభం లేదు. నేనీ అప్రాచ్యాన్ని భరించలేను. ఈ తిన్నడిపై ఆలయ నిషేధం విధించాల్సిందే, తప్పదు. పరమశివా! మన్నించు (గంటలు వినిపిస్తాయి అద్భుతం జరిగిన సంగీతం)

శివుడు : (కంఠధ్వని మాత్రం వినిపిస్తుంది) శివబ్రాహ్మణా! తొందరపడకు, తిన్నడు శివభక్తుడు. అందుకే నేను సహిస్తున్నాను. నాతోపాటు నువ్వూ సహించు. ఈ రోజు తిన్నడి భక్తిని నువ్వే పరిశీలించు.

శ.బ్రా. : సరే స్వామీ! (శివ బ్రాహ్మణుడు. శివలింగం వెనక దాగి ఉంటాడు. తిన్నడు ప్రవేశిస్తాడు.

తిన్నడు : శివయ్యా! ఉదయాన్నే నైవేద్యం పెట్టానే ఇంకా ఆరగించలేదా స్వామీ! దొరికిందేదో నీకే అర్పించాను. ఉదయం నించి వెతుకుతున్నాను. మళ్ళీ నాకు వేట దొరకలేదు. నీకు ఆరగింపు పెట్టిన నన్ను ఉపవాసం ఉండమన్నావా (వర్షపుహోరు) వర్షం తగ్గి వేట దొరికేలా చూడు స్వామీ "ఓం నమశ్శివాయ – ఓం నమశ్శివాయ ఓం నమశ్శివాయ – ఓం నమశ్శివాయ

వర్షం తగ్గినట్టుంది. స్వామీ! వస్తాను (ఆశ్చర్యంగా). స్వామీ ఇదేమిటి? కరుణ చిలికే నీ కళ్ళలో రక్తకన్నీరా – ఉండు మందేస్తాను....తగ్గలేదా స్వామీ! నేను చూడలేకుండా ఉన్నాను. ఏం చేస్తే నీ కన్నీరు ఆగుతుందో చెప్పు స్వామీ! ఆ! నువ్వెందుకు పలకలేదో అర్థమయింది. కన్నుకి కన్నే మందు. నీకర్పించకపోతే ఈ కన్ను నాకెందుకు స్వామీ! నా కన్నే నీకిస్తాను. (కన్ను పీకి అతికిస్తాడు) ఎంతో

చక్కగా కన్ను అమరింది స్వామీ! అయ్యయ్యో రెండవ కంటికి కూడా కన్నీరా! బాధపడకు స్వామీ నేనున్నాను. ఇదిగో నా రెండో కన్ను కూడా నీకు సమర్పిస్తాను. నాకీ జన్మనిచ్చిన నీకు నా కళ్ళిచ్చాను. నా జన్మ ధన్యమయింది స్వామీ!

(గంటలు గణగణ మ్రోగుతాయి. అద్భుతం జరిగిన సంగీతం)

తిన్నడు : పరమశివా ఎంత దయామయుడివి నా కళ్ళు నాకిచ్చేశావా స్వామీ!

పద్యం

శి.బ్రా : నాయనా 'తిన్నా! మహాభక్తుడివయ్యా నువ్వు. నీ భక్తిని శంకించి నేను మహాపాపం చేశాను. నన్ను క్షమించు. కాళహస్వీశ్వరుడికి కళ్ళిచ్చిన నువ్వు కన్నప్పగా ప్రసిద్ధి పొందుతావు.

తిన్నడు : అంతా ఆ శివానుగ్రహం.

❄❄❄

సారథి : చదువు సంధ్యా లేని కన్నప్ప ఎంత త్యానికి పూనుకున్నాడో విన్నారా. దైవభక్తి మానవుల్లో త్యాగానికి పునాది వేస్తుంది.

వివేక్ : ఈ పుణ్యక్షేత్రాల్ని సందర్శించకపోబట్టే, ఈ త్యాగమూర్తుల కథలు తెలుసుకోకపోబట్టే నాలో కీర్తి కాంక్ష పెరిగి విచక్షణ కోల్పోయేననుకుంటున్నాను సారథీ!

సారథి : అందుకే మన పూర్వీకులు క్షేత్ర దర్శనము, మహా పురుష దర్శనము, సద్గ్రంథ పఠనం, సజ్జన సాంగత్యము చేసేవారు. ఇవి లేకనే ఈనాడు మారణహెూమం మానవుల ధర్మం అనుకుంటున్నారు సర్. సంకీర్తన జరుగుతోంది పదండి.

పాట

పల్లవి : ఓం నమ:శివాయ ఓం నమ:శివాయ ఓం నమ:శివాయ
పంచాక్షరి మంత్రము (3) పరమపద సోపానము
భువనైక కల్యాణ దం
ముని జీవనాధారము
ఇరకుల సోమ శరణ్యం

పంచాక్షరీ మంత్రము (2) పరమపద సోపానము పంచాక్షరీ మంత్రము

ච. 1. : హిమగిరి బాలావదన సారసం
నివసిత శోభన నీరము
కలహాసన మహతీ ఘనస్వన
ప్రతిధ్వనించదు ఆగమ సారము
తారక రిపు జన్మకై
సురవరులకే ధ్యానమై
ప్రకాశించు ఆవనకర మంత్రము....
ఓం నమ:శివాయ (4)........... ॥పంచాక్షరీ॥

❄❄❄

సారథి : సర్. ఇక్కడ నుంచి కలియుగ వైకుంఠ తిరుమల గిరి శిఖరాలకు వెళదాం. శ్రీనివాసుని శ్రీపాదాలను దర్శించుకుందాం. కోట్లాది మంది ప్రతినిత్యం ఆ తిరుమల కొండకు చేరుకుంటారు. 'గోవిందా' 'గోవిందా' యని గోవింద నామస్మరణం చేసుకుంటూ ఏడుకొండలూ ఎక్కుతారు. సాక్షాత్తూ వైకుంఠవాసుడైన శ్రీమన్నారాయణుడే ఆ తిరుమల గిరులపై నిలచి ఉన్నాడని భక్తుల విశ్వాసం. శ్రీనివాసుని భక్తుల చరిత్రలు వింటే భక్తుల కోసం భగవంతుడెలా దిగి వస్తాడో తెలుస్తుంది.

వివేక్ : భగవంతుడు భక్తుడి కోసం దిగివస్తాడా. ఎప్పుడూవినలేదే.

సారథి : వినుంటే న్యూట్రాన్ బాంబు కనిపెట్టేవారు కాదు (ఇద్దరూ నవ్వుకుంటారు) (తిరుమలలో శ్రీవారి ఆలయ ప్రాంగణం. అక్కడ స్వామిని వైభవంగా అలంకరించి ఉంటారు. చక్కని నృత్యోత్సవం జరుగుతూ ఉంటుంది.)

**పాట**

పల్లవి : ఆనంద మానంద మానంద మయము (2)
ఆనంద నిలయమా శ్రీ శ్రీనివాస
ఇలపై వైకుంఠ మిదియె (2)
ఈ కంట కందును కైవల్య మిదియు
ఆ తేరుపైన శ్రీదేవి తోడ

చ. 1. : భూదేవితో గూడి నీవుండు వేళ
బ్రహ్మాదులరుగో నిలచేరు స్వామీ
ఈ తేరు మేమంత నడిపే వేళ – 2
ఇలపై వైకుంఠ మిది యే
ఈ కంట కందును కైవల్య మిదియే ఇలపై వైకుంఠమిదియే

చ. 2. : ఆంజనేయుని పైన ఆ హంస పైన – 2
పొన్నచెట్టు మీద ప్రభల శోభలపైన – 2
తిరువీధి వెంట నీ గరుడ సేవ – 2
నా స్వామి, నా దేవ అపురూపమయ్య – 2
ఇలపై వైకుంఠ మిదియే – 2
ఈ కంట కందును కైవల్య మిదియే – 2

బావాజీ : గోవిందా! శ్రీనివాసా! ఆపద్రక్షకా! అనాథనాథా పాహిమాం శ్రీనివాసా నీ దివ్య మంగళ స్వరూపం ఎంత చూచినా తనివి తీరడంలేదు. ఒక్క క్షణం కూడా నిన్ను వదిలి ఉండలేను స్వామీ! నన్ను నీ పాదాలచెంతనే ఉండనీ స్వామీ!

ఆచారి : అయ్యా పవ్వళింపుసేవ అయింది. ఆలయం తెర వెయ్యాలి. తమరు వెళ్ళండి.

బావాజీ : అయ్యా నన్ను వెళ్ళమనకండి. నా స్వామిని నా కన్నతండ్రిని శ్రీ వెంకటేశ్వరుణ్ణి కనులారా చూడనివ్వండి. ఆ పాదాలు విడిచి వెళ్ళలేను. దయచేసి తెర వేయకండి.

ఆచారి : తెర వెయ్యొద్దంటావు ఇదెక్కడి విడ్డూరమయ్యా వెళ్ళు.

బావాజీ : అయ్యా మీ పాదాలు పట్టుకుంటాను. నన్ను వెళ్ళమనకండి. నా స్వామి నుంచి నన్ను దూరం చెయ్యకండి. ఆ వైకుంఠవాసుని, శ్రీనివాసుని వదలి ఉండలేను. తిరుమల వాసుని చూడకుండా నిముషమైనా గడపలేను. దయచేసి తెర వేయకండి.

ఆచారి : పిచ్చివాడిలా ఉన్నాడు. బయటకు పంపండి. తెర వెయ్యాలి. (తెర వేస్తారు)

బావాజీ : శ్రీనివాసా నా పిలుపు వినవా నన్నాదుకోవా. గోవిందా గోవిందా.........

(బావాజీని బయటకు తీసుకువెళతారు)

(బావాజీ దు:ఖిస్తాడు)

❄❄❄

(విచారంగా బావాజీ ప్రవేశిస్తాడు)

బావాజీ : తిరుమల గిరివాసా! శ్రీనివాసా బాలాజీ ఈ దీనుడిపై దయలేదా స్వామీ. క్షణమైనా నీ సమ్మోహన రూపం చూడకుండా ఉండలేనే నన్ను విడిచి నువ్వెలా ఉండగలుగుతున్నావు స్వామీ. శ్రీనాథా నీ సన్నిధి ప్రసాదించవా. నీ దివ్య దర్శన సౌభాగ్యం కల్పించవా.

పాట

ఓం నమో నారాయణాయ

(సొమ్మసిల్లి పడిపోతాడు)

(శ్రీనివాసుడు తెర తీసుకుని వస్తాడు)

బాలాజీ : బావాజీ! బావాజీ!

బావాజీ : ఎవరు స్వామీ

బాలాజీ : నేనే నీ బాలాజీని నీ శ్రీనివాసుణ్ణి.

బావాజీ : స్వామీ! శ్రీనివాసా గోవిందా ఆపద్బాంధవా ఆర్తత్రాణ పరాయణ పాహిమాం పాహిమాం! అనంత కరుణామూర్తివై తిరుమల శిఖరాలు నాకోసం దిగి వచ్చావా స్వామీ! ఎంత కరుణామూర్తివి! నన్ను నీ పాదాలకు దూరం చెయ్యకు స్వామీ! నిరంతరం నీ పాద సన్నిధిలో ఉండేలా అనుగ్రహించు.

బాలాజీ : బావాజీ నీతో పాచికలాడటానికి వచ్చానయ్యా.

బావాజీ : నువ్వేం చేయమన్నా చేస్తాను స్వామీ!

(ఆటలాడుతాడు)

బాలాజీ : చూశావా! నేనే ఓడిపోయాను.

బావాజీ : ఇదంలా నీ లీలా నాటకం తప్ప భగవంతుడెప్పుడైనా ఓడిపోతాడా స్వామీ!

బాలాజీ : భక్తుడు గెలిస్తేనే నాకు ఆనందం బావాజీ ఇక వెళ్ళి రానా.

బావాజీ : స్వామీ నిన్ను విడిచి ఉండగలనా!

బాలాజీ : ఎప్పుడూ నా నామాన్ని స్మరించు. నీ చెంతనే ఉంటాను. పిలువగానే పలుకుతాను.

❄❄❄

సారథి : చూశారా సార్! భక్తుడు భగవంతుణ్ణి ఎలా రప్పించుకున్నాడో.

వివేక్ : సారథీ జీవితంలో నేనేం కోల్పోయానో నాకర్థమయింది. భగవద్విశ్వాసాన్ని ఏర్పరచుకుని భగవంతుడి అనుగ్రహాన్ని పొంది ఉంటే ఈ ప్రపంచానికి ఎంత మేలు చేయగలిగేవాడినో. బిడ్డలు పోగొట్టుకున్న ఎంతమంది తల్లులు నన్ను శపించి ఉంటారో. భర్తలను కోల్పోయిన ఎంతమంది స్త్రీలు నన్ను నిందించి ఉంటారో తలచుకుంటే నా మీద నాకే అసహ్యమేస్తోంది. నా జీవితం సన్మార్గంలో పదిమందికి ఉపయోగించేలా నడుపుకోవాలి. నడుపుకుంటాను.

సారథి : సర్ ఇప్పటిదాకా భగవంతుణ్ణి శిలారూపంలో చూశారు. ఆ శిలామూర్తులే మీలో భక్తి చైతన్యాన్ని భగవద్విశ్వాసాన్ని కలిగించగల్గాయి. మరి ప్రత్యక్ష దైవాన్ని చూస్తే మీ జీవితాన్ని మానవసేవకే హారతి కర్పూరంలా అర్పించగలుగుతారు. ఇప్పుడు ప్రశాంతి నిలయంలో అడుగు పెట్టడానికి అర్హత సంపాదించుకున్నారు. రండి ప్రశాంతి నిలయం వెళదాం.

వివేక్ : సారథీ ఇక సార్ అని పిలవకు. డేడీ అని నోరారా పిలువు.

❄❄❄

సారథి : రండి డేడీ. ప్రపంచాన్ని ప్రేమ నందనంగా మారుస్తున్న ప్రశాంతి నిలయం ఇదే. రోగుల సేవలో, విద్యాబోధనలో అమృతప్రేమ ప్రవహించే ప్రేమ బృందావనాన్ని సృష్టించినవీ, కుల మత దేశ వర్గ వైషమ్యాలను కూలద్రోసి ప్రపంచాన్ని ప్రేమసూత్రంతో బంధించగల ప్రేమవాహినిని ప్రవహింపచేసేవీ, కాణిపాకంలో, శ్రీకాళహస్తిలో, తిరుమల శిఖరాలపైన మీలో భక్తిచైతన్యం కల్గించినవి భగవంతుని శ్రీపాదాలు. ఈనాడు సజీవమూర్తులుగా మీ ఎదుట దర్శనమిస్తున్నాయి. అదుగో ఆ పాదాలే మా స్వామి పాదాలు.

ఆ పాదాన్ని నమ్ముకోండి. శరణు వేడండి. ఆరాధించండి. ఆశ్రయించండి. మీలో దానవత్వం మరుగై మానవత్వం వికసిస్తుంది. విశ్వశ్రేయస్సుకి మీ

సేవలందించగలుగుతారు.

పద్యం

సీ॥ మా స్వామి పాదాలు మందాకినీ పుణ్య
తీర్థాల కంటే ముక్తిప్రదాలు
మా స్వామి అడుగులు మధువసంత శిరీష
కనుమ రేఖలకంటె కోమలాలు
మా స్వామి సుపదాలు మహేంద్రవనిలోని
మందారములకంటే సుందరాలు
మా స్వామి చరణాలు మాని నందినిపాల
ధారలకంటే సుధారసాలు
అమృత భరితాలు అతి మహిమాన్వితాలు
దీన శరణాలు నతజనార్తి హరణాలు
ధార్మిక వరాలు ప్రేమ రత్నాకరాలు.
సత్య శివ సుందర వరాంఘ్రి సరసిజాలు.

వివేక్ : స్వామీ! మానవ మారణ హోమానికి దోహదం చేసిన నన్ను మన్నించండి. మీ పాదాలచెంత చోటివ్వండి. ప్రపంచంలో ప్రేమనందనాలు వికసింపచేసే స్వామి అవతారవైభవంలో సేవ చేసి తరించే అవకాశాన్ని ఈ బిడ్డకు కూడా కల్పించండి.

పాట

పల్లవి : అణుస్వరూపమా ప్రణవరూపమా
అనాది బీజమా ఆదితేజమా
సర్వాంతర్యామి (4)
సాయిశరణం సాయిశరణం గచ్ఛామి (2)

చ. 1. : మేమెంత ధన్యులమో మీ రూపు చూశాము

పూర్వజన్మ పుణ్యఫలము నీ పాదములు తాకాయి
ఈ జన్మకు ఇది భాగ్యం నీ మాటలు విన్నాము.
మరుజన్మలే లేకుండా నీ సేవలో తరియించాము ॥అ॥

చ. 2. : నీ నోట సూక్తి సుధలు మహా శివుని స్వరూపము
విశ్వశాంతి మంత్రములు బీజాక్షర మంత్రములు
విగ్రహాలు రుద్రాక్షలు విచిత్రముగ విభూతులు
సృష్టికర్తా - నీ సన్నిధి దివ్య నవ్య అనుభూతులు ॥అ॥

❄❄❄